# మూడుస్థలాల్లో

## సెషన్స్ కోర్టులో

జనం కిటకిట లాడుతున్నారు.

పావుతక్కువ పదకొండయింది. పదకొండో గంటకల్లా జడ్జీగారు బెంచి కొస్తారు; వెంటనే తీర్పు చెప్తారు.

ఆరు నెలల క్రితం ఒకరోజు తెల్లవారుఝామున ఒక పాడుపడ్డ ఇంటి వరండాలో రెండు కుక్కలు ఒక మనిషిని అటూ ఇటూ పట్టుకొని పీకుతూండం చూసి పాలమ్మే మనిషి ఒకామె కెవ్వున కేకవేసింది.

కుక్కలు పీకేది ఓ ముప్పయ్యేళ్ళ ఆడమనిషి శవాన్ని. అది అర్ధనగ్నంగా ఉంది. దానిమెడ సగందాకా కోసేసి ఉంది. చెవి తమ్మెలు తెగిపోయున్నాయి. మొలనొక ఇచ్చరూపాయి మాత్రం మిగిలిపోయింది.

ఆ మర్నాడు పాతకోనేటి గట్టున అమ్మవారి పాడుపడ్డ గుడివెనక మరొక ఆడమనిషి శవం! తెగిన మెడలో తెగిన చెవికుట్లతో, చెదిరిన చీరెతో పడుంది. మొలనొక నలిగిన రూపాయినోటుంది.

మూడోరోజున సముద్రతీరాన్న అదేవిధంగా మరొక శవం! పల్లెటూరి నుంచి వచ్చిన పద్దెనిమిదేళ్ళ ఆడపిల్ల. ముక్కూవీ, చెవులవీ, కుట్లు తెగిపోయున్నాయి. విప్పారి ఆరిపోయిన ఆమె కళ్ళు ఆకాశంకేసి తిరిగున్నాయి. ఆమె మొలనొక కాణీ అయినా లేదు.

ఏవిటీ ఘోరాలు???

ప్రతి పౌరుడూ హాహాకారాలు చేసేడు. ప్రతి పత్రికా గోలపెట్టి పత్రులనెన్నో అమ్ముకొంది. ప్రతి పిల్లడూ గడగడ లాడిపోయేడు. ప్రతి ఆడదీ హడలెత్తిపోయింది.

హంతకుణ్ణి, హంతకుల్ని పట్టజాలనందుకు పోలీసువార్ని అందరూ కలిసి తన్నినంత పనిచేసేరు.

దాన్తో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసువారు వాయుమార్గానవచ్చి

వూళ్ళో మకాం పెట్టేరు. ఒక "సర్కిల్"కి ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లకి ఛార్జీలొచ్చాయి. ప్రతి పోలీసు జవానూ పిచ్చెత్తిపోయేడు. కనబడ్డ ప్రతి పాత నేరస్తుడూ పోలీస్టేషన్కి లాక్కుపోబడ్డాడు. ఎక్కడా కూపీ మాత్రం దొరకలేదు.

మూడు వారాలు జరిగిపోయే, నాలుగోవారం కూడా జరిగింది.

ఇంతలో నాలుగోదఫా అదేమాదిరి ఘోరకృత్యం!

నాలుగుహత్యలూ "ఎవడో ఒక్కడే చేసుండాలి" అన్నారు పోలీసువారు.

"ఎవడువాడు?" అని గద్దించింది ప్రజానీకం.

"పట్టి తెస్తాం! పని పడ్తాం" అని చెప్పిన పోలీసు వారు ఒక చిన్నదాన్ని పట్టుకున్నారు.

ఆమె పేరు అందాల చిన్న.

ఆమె ఒక "బజారు లంజ."

ఆమె వప్పుకుంది. చెవులకి మంచి లోలకులు తగుల్చుకొంది. వంటిని అంతకంటె హెచ్చు ఉండకూడదన్నారు. సరేనంది చిన్న. అని బయల్దేరింది.

రెండోఆట సినిమా విడిచారు. హాలుకి ఎదురుగా ఉన్న దుకాణంలో పకోడీలు కొనుక్కొని మెల్లిగా నముల్తూ, నెమ్మదిగా నడక సాగించింది అందాలచిన్న. నలుగురు స్టూడెంట్లు ఆమెని కొంతదూరం వెంబడించి ఆగి తర్జన భర్జన చేసుకొని మరోదార్ని ఓ చీకటి సందంట పోయారు. ఓ సుందరాంగుడు ఆమె పక్కనించి రిక్షాని నెమ్మదిగా పోనిచ్చి పోనిచ్చి చివరికి విసుగెత్తి ముందుకుపోయేడు. రెండో ఆట సినిమాజనం ఎక్కువమంది లేరు. వాళ్ళంతా తక్కువ కాలంలోనే ఇళ్ళకి చేరుకున్నట్టున్నారు. అందాల చిన్న రైల్వేస్టేషన్ వైపు నడక మళ్ళించింది. ఆమె వెనక కొంతదూరంలో ఒక ఖాళీ సైకిల్ రిక్షా ఆమెని అనుసరించి నడుస్తున్నట్టుగా వస్తూంది.

ఒంటిగంట పాసెంజరు వచ్చి వెళ్ళిపోయి చాలాసేపయింది. స్టేషన్ దగ్గర బళ్ళూ రిక్షాలూ ఎక్కడా కనిపించడం లేదు. స్టేషన్‌కి కాస్త దూరంగా విద్యుద్దీపాల వెలుక్కి అందకుండా కానాగట్టుమీద కూర్చుంది అందాల చిన్న. స్టేషన్ వైపునించి ఒక ముష్టివాడు కుంటుకొంటూవచ్చాడు. అందాలచిన్నకి అందరూ బాగా తెలుసు.

ఆఖరి పకోడీ నోట్లో పడేసుకొని ఆకు నలిపి పారేసి, "ఏం తాతా! ఇయాల దరమదాత లెంతమంది!" అని ముసలాణ్ణి అడిగింది చిన్న.

"ఒక్కడుంటే ఒట్టు సిలకా!" అని చెప్పిన ముష్టివాడు ఎదర గట్టుమీద కూర్చొని మూడు చిన్నచిన్న మూటలు ఒకటీ ఒకటీ విప్పడం మొదలెట్టేడు.

ఇంతలో స్టేషన్ పక్కనీడల్లోంచి బైటకివచ్చి నెమ్మదిగా నడుస్తూ అటుయిటు పరిశీలించి చూస్తూ, కానావైపు వస్తూన్న ముప్ఫయ్యేళ్ళ యువకుణ్ణి దగ్గరగా రానిచ్చి,

"ఏంరా పెదపాపా! జోబీ లెలాగున్నాయిరా ఇయాల" అంది అందాల చిన్న. కుంట ముష్టివాడు ఒక్కసారి తలెత్తి చూసి మళ్ళీ తన పనిలో నిమగ్నుడయేడు.

ఆ యువకుడు చిన్నవైపే చూస్తూ నడుస్తూ "ఎవరూ!" అంటూ ఆమెకి దగ్గరగా వచ్చేసరికి–

"కళ్ళు గుడ్డిపోనాయేట్రా!" అని అడిగింది కానా గట్టుమీద కులాసాగా కూర్చున్న బజారుభామ.

"ఒస్! నువ్వటే సిలకలసిన్న!" అంటూ ఆ యువకుడు చక్కగా ఆమె పక్కన కూర్చొని,

"నోలక్కులెట్టేవు! పోల్చుకోకపోయేనే!" అన్నాడు. ఆ లోలక్ లవైపు మరోసారి బాగా చూసి "యవ్వారం కిర్రుగుందే!" అన్నాడు.

అందాల చిన్నకి "చిలకలచిన్న" అనే నామాంతరం వుంది.

చిలకలచిన్నా, జేబుకాట్ల పెదపాపడూ బూతులాడుకొంటూ ఊసులాడుకొంటూ ఉండగా ముష్టివాడు మూడు మూటలూ తిరిగి కట్టేసుకొని ఎప్పుడు వెళిపోయేడో వెళిపోయేడు. తరవాత పెదపాపడు అర ఫర్లాంగు దూరంలో ఉన్న టీ దుకాణానికి వెళ్ళి కప్పుడు వేడి టీ పట్టుకొచ్చి అందాల చిన్నకిచ్చేడు. ఆమె కొంత టీ తాగేక మిగతాది తను తాగి, ఖాళీ కప్పూ సాసరూ కొట్టుకి పట్టుకువెళ్ళి ఇచ్చివచ్చి చిన్నని తీసుకొని ఉత్తరానికి పోయే చీకటిరోడ్డంట ఆమెకి కితకితలు పెడుతూ నడిచేడు పెదపాపడు. వాళ్ళు కొంతదూరం వెళ్ళేక ఖాళీ రిక్షా ఒకటి వాళ్ళవెనక ఆ చీకట్లోకి దూరింది.

చిలకల చిన్నకి ఆ సమయంలో భయం వేసిందా! ఆమెకి నిజంగా గుండె నిబ్బరం వుందా!

వారి వెనకనే వెళ్తూన్న రిక్షా కొంతదూరం వెళ్ళి ఆగిపోయింది. ఇద్దరూ ఎక్కడ మాయమయేరో అంతు చిక్కలేదు రిక్షాకి.

ఇంతలో ఆ కారుచీకట్లోంచి అదేదో పెనుకేక పొడుచుకువచ్చింది. అటూ ఇటూ చూస్తూ నిల్చుండిపోయిన రిక్షావాడు వెంటనే పోలీసు ఈలవేసేడు. దాన్తో ఎక్కడెక్కణ్ణించో ఎన్నో ఈలలు వినవచ్చేయి. అన్ని ఈలలూ దగ్గరకొచ్చి బంధించేయి.

హంతకుడు చిక్కేడు.

కాని, ఊరంతా దుఃఖించింది.

చిలకల చిన్న వాడి ముఖమంతా చీరేసింది. వాడి జుట్టంతా గుప్పెళ్ళతో పీకేసింది. సైరన్‌లా కేకలేసింది. 'రాక్షసి'లా పెనుగులాడింది. కాని పోలీసుసాయం వచ్చేలోపున దెబ్బ తినేసింది. అప్పటి కప్పుడే చెవి తమ్మెలు తెగిపోయేయి, మెడ కొంత విడింది.

పులి చిక్కిందికాని, ఎరగా వెళ్ళిన మేకమాత్రం దక్కిందికాదు.

ప్రజలంతా ఆమె సాహసానికి అచ్చెరువందేరు. ఆమె త్యాగాన్ని తలుచుకొని వినమ్రులయేరు. ఆమెని స్త్రీ రత్నమన్నారు, వీరనారన్నారు. ఆహా ఓహో అన్నారు.

ఆమెపేరు అందాల చిన్న.

బతికి ఉన్నప్పుడామె "బజారు లంజ."

ఆ తరవాత విషయలు అందరికీ తెలిసినవే. జేబుకాట్ల పెదపాపడు పట్టుపడ్డం, చిలకలచిన్న మరణవాంగ్మూల మివ్వడం("చచ్చిందికాని తస్సాదియ్యా స్టేటుమెంటిచ్చే క్కాని చచ్చిందికాదురా") ముద్దాయిమీద కేసు విచారణకి రావడం ఈ సంగతులందరికీ తెలుసు.

రిక్షా తొక్కిన పోలీస్ ఇన్‌స్పెక్టరిచ్చిన వివరాలు; కుంటిముష్టి చెప్పిన వృత్తాంతం; టీ దుకాణం వాడి సాక్ష్యం; చిలకలచిన్న కడుపులో టీ చుక్కలు; ఆమెచేతిలో చిక్కుకున్న ముద్దాయి జుట్టు; ముద్దాయి ముఖంమీద రక్కులు; దగ్గర్లోదొరికిన నెత్తుటి కత్తి; చిలకలచిన్న చనిపోతూ ఇచ్చిన స్టేటుమెంటు, నెత్తుటి బట్టలు; అతను పారేసిన లోలక్‌లు...

ముద్దాయిమీద కేసు బిగిసింది. విచారణ ఎట్టకేలకు ముగిసింది.

మరింక ఈ రోజున జడ్జిగారు తీర్పు చెప్తారు.

పావుతక్కువ పదకొండు దాటింది. పదకొండుకీ పది నిమిషాలు తక్కువలో ఉన్నాయి.

కోర్టు హాల్లో కుర్చీలు చాలక న్యాయవాదులే అవస్థలు పడుతున్నారు. జనం అంతా గోడలకి నొక్కుకుపోయి, నలిగిపోయి, చెమటతో తడిసిపోతున్నారు. ఒక్కొక్కరూ అతి నెమ్మదిగా ఆడేమాటలన్నీ కలిసి అల్లరిగా ఉంది.

పదకొండూ అయింది.

జడ్జీగారు బెంచికొచ్చేరు.

గాలిపోవడంతో చెట్ల ఆకులన్నీ సర్దుకున్నట్టు జడ్జీగారు రావడంతో కోర్టు హాలంతా నిశబ్దం అయిపోయింది. అంతలోనే తిరిగి కొద్దిగా గొడవయింది. గుమ్మం దగ్గిర జనం ఒత్తిగిల్లేరు.

రక్షకభటులూ ముద్దాయీ హాల్లోకి ప్రవేశం. జనంగోల. కోర్టు బంట్రోతు "సైలెన్సు" అంటూ వేసినకేక. అంతా నిశ్శబ్దం. ముద్దాయి బోన్లో చేతులుకట్టుకు నిలబడ్డం ; చెరోవైపూ నిల్చున్న రక్షకభటుల చేతుల్లో ఉన్న తుపాకీలకి తార్చిన కత్తులు మెరియడం; హాలంతా నిశ్శబ్దం; బిగుసుకు పోయిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ జడ్జీగారి కలం పరపర!

జడ్జిమెంటు సంతకంచేసి, జడ్జీగారు గొంతుక సవరించుకున్నారు. అందరి కళ్ళూ అటే ఉన్నాయి.

జడ్జీగారు తీర్పు చెప్తున్నారు.

అందరి చెవులూ అటువైపే; అందరికళ్లూ ఆ దిక్కే.

జడ్జీగారు తీర్పు చెప్తున్నారు?

అనుకున్నట్టుగా నేనా?

హాఁహాఁ అనుకున్నట్టే. అవునవును అనుకున్నట్టె. అదే అదే అనుకున్నట్టె. అద్గదీ అనుకున్నట్టె.

జడ్జీగారు తీర్పుచెప్పేరు.

శిక్ష విధించేరు.

అందరికళ్ళూ అప్పుడు తిరిగేయి ముద్దాయీ ఉండే దిక్కు.

ఏడీ ముద్దాయీ?

అడుగో?

బోన్లోంచి, కోర్ట్‌హాల్ మధ్యలోంచి, జడ్జీగారి ఛాంబర్స్ లోంచి, సర్రున బాణంలా వెళ్ళిపోయేడు ముద్దాయీ.

## ఆసుపత్రిలో

రాత్రి పదకొండు గంటల సమయంలో కాజ్వాల్టీ వార్డులో కూర్చున్నాడు డాక్టర్ సుందరం.

పని ఉండకపోతే ఉండనే ఉండదు. ఉంటే ఊపిరి తీసుకొందికి వీల్లేకుండా ఉంటుంది; అయిదు నిమిషాల వ్యవధిలోనే అందరూ ఒచ్చిపడ్డారు. తేలు కుట్టిందని ఒకరొచ్చేరు. కాలు విరిగిందేమోనని ఒకరొచ్చేరు. వారితో కూడా వచ్చిన వార్లో ఒకరికి అక్కడికక్కడ మూర్ఛవచ్చింది. ఎక్కడో రిక్షా తిరగబడ్డం వల్ల ఒక అతిలావుపాటి షావుకార్ని పదిమంది మోసుకొచ్చేరు. ఆ రిక్షాకున్నపాటి బుద్ధయినా మనుష్యులకి లేదని ఎవరో చింతించేరు. నలుగురు తాగిన వాళ్ళు ఇద్దరు రక్షకభటులచే తీసుకురాబడ్డారు. "ఆకలిజబ్బుకి ఆస్పత్రేం జేస్తుంది? గవర్నమెంటేం జేస్తుంది?" అని ఒకడు తగిలి వేయబడ్డాడు.

"ఎలాగైతేనేం అందరూ ఇళ్ళకో, వీధుల్లోకో, వెళ్ళి పోయేరు. కాసేపు కళ్ళు మూసుకూర్చుందాం" అనుకున్నాడు డాక్టర్ సుందరం. అందుకు వీలివ్వకుండా నర్సూ, హవుస్సర్జనూ గొణగొణలాడుతున్నారు.

నర్సూ-తెలుగు మనిషే కాని-మళయాళీయాసతో హవుస్సర్జన్తో ఏదో చెప్తోంది.

అతను ఆమెని తను ప్రేమించే ఫైనల్ యియర్ మెడికోగా ఊహించుకొని, ఆమెకి తన ప్రొఫైల్ కనబడేలా కుర్చీలో అస్టుగా కూర్చొని ఆమె చెప్పేదంతా వింటూ, మధ్యమధ్య గంభీరధ్వనులు చేస్తున్నాడు.

కోర్టులోంచి జేబుకాట్ల పెదపాపడు పారిపోయినందుకు నర్సు చాలా మెచ్చుకొంటోంది.

"ఏదండీ డాక్టర్! థౌజెండ్స్ ఆఫ్ పీపుల్ మధ్య నించి వాడెలా అస్కేప్ చేసేడండీ? బ్యూటిఫుల్! వాట్ డూ యూ సే?" అనగలిగిన నర్సమ్మ "ఏమణ్ణి డాట్ట(ర్)! థౌజెండ్స్ ఆప్ పీవుళ్ మజ్జినుంచి వాడెట్ట అస్కేఫ్ చేసేడండీ?! బ్యూటిపుళ్!! వాట్ డూ యూసే?" అంటోంది, ఆ హవుస్సర్జన్నే తనకి ప్రియమైన నాయర్ హొటేలు ప్రొప్రయిటర్‌గా భావించుకొంటూ.

ఆమె ప్రశ్నకి జవాబుగా హవ్సర్జ నేవో గంభీర ధ్వనులు చేసేడు. అతను 'ఆఖరేడాదమ్మాయి' గురించి ఆలోచిస్తూంటే, పారిపోయిన ముద్దాయిని పనిలేని నర్సుహాయిగా పొగుడుతోంది. హవుస్సర్జన్‌కి ముద్దాయి గురించి ఆలోచించాలని అంతగా లేదు. అందులోనూ ఆడమనిషి లొట్టలు వేస్తూ తన ముఖం ముందే మరో మగాణ్ణి అదే ఇదిగా పొగడ్డం విని విని అతను గిజగిజలాడి చిరాకుపడి "ఆఁ! అబ్లడీ స్కౌండ్రల్ ఎక్కడికి పోతాళ్ళే! ఇవాళో, రేపో దొరక్కపోడు" అన్నాడు.

ఎంతో లవ్‌లీగా, ఎంతో చలాకీగా పారిపోయిన ఆ ముద్దాయి మరింక చిక్కడు చూసుకోం డంటోంది నర్సు.

వాడు రాక్షసుడూ, హంతకుడూ, పరమ పాపాత్ముడూ అయినప్పటికీ వాడంత చక్కగా (ఛౌళీగ) పారిపోగలిగినందువల్ల వాడి పాపాలన్నింటినీ ఆ నర్సు అంత సులభంగా క్షమించడానికి సిద్ధపడ్డంచూసి డాక్టర్ సుందరం ఆశ్చర్యపడ్డాడు. "ఆడవాళ్ళంతా ఇంతేనా? లేక మిడిల్‌క్లాస్ ఆడవాళ్ళే యిలా వుంటారా?" అనుకున్నాడు. దాంతో అతనికి తక్కువరకం ఆడవాళ్ళగురించి ఆలోచన పోయింది. అందుమీదట అతనికి చిలకల చిన్న గుర్తుకి వచ్చింది.

డాక్టర్ సుందరం కళ్ళుమూసుకొని, కాళ్ళు బాగా జాచుకొని ఆయాసం తీర్చుకొంటున్నవాళ్ళా ఈడిగలబడి కుర్చీలో కూర్చున్నాడు.

అతను మరో ఏడాదిలో ఉద్యోగంలోంచి రిటైరయిపోతాడు. కాని, అతన్లో ముసలితనం లేదు. బద్ధకంగా కనిపిస్తున్నాడేకాని పని వచ్చినప్పుడు స్ప్రింగులా లేవగలడు. బంతిలా తిరగగలడు. అయితే, అత నెప్పుడూ కొంచెం చిరాగ్గా ఉన్నట్టు కనిపిస్తాడు. అతను పెద్దింటి ఆడవాళ్ళని కసురుతాడు, షోకైన మగవాళ్ళని తిడతాడు. చిన్న చిన్న పిల్లల్ని లాలిస్తాడు. ఒళ్ళువంచి కష్టపడ్డంమాత్రం కష్టపడతాడు.

ఎంత కష్టపడితేమటుకు ఏం లాభం? సివిల్ సర్జన్ ప్రమోషనివ్వకుండా అతన్ని అసిస్టెంటుగానే తొక్కిపెట్టి ఉంచేరు. అయితే అతను లాభం ఉంటేనే పనిచేసే రకం మనిషికాడు. పాతికేళ్ళ సర్వీసులోనూ అతన్ని అన్ని అడవులూ అన్ని ఎడార్లూ తిప్పేరు. ప్రజలకి చాకిరీ చెయ్యడానికి ఊరైతే నేవిఁటి ఎడారైతేనేవిఁటనే అనుకున్నాడు కాని అతను మరో విధంగా అనుకోలేదు. 'గంజిపేట, అంబలిపల్లె నాకొద్దు; అమలాపురం కనకాపట్నాలే నాక్కావాలి' అని అతనెప్పుడూ అన్లేదు. అధికార్లు తనకి తీసిన దెబ్బల్ని ప్రజలమీది కెప్పుడూ అతను ట్రాన్స్ఫర్ చెయ్యలేదు.

ఏయేడాదీ ఆర్నెల్లయినా ఈ పెద్దాస్పత్రిలో అతనికి వుండాలని ఉంది. అదికూడా జరిగేట్టు లేదు. అంటురోగుల ఆస్పత్రికో సెంట్రల్ జెయిలుకో అతన్ని త్వరలోనే పంపించేట్టున్నారు.

"ఎక్కడైతే నేవిఁటి? మన డ్యూటీ మనది. డ్యూటీ! డ్యూటీ!" అనుకున్నాడు డాక్టర్ సుందరం.

అంతలో-

తెలుగునర్సు మళయాళీయాసతో వార్డ్‌బాయ్ అప్పలస్వామిని, "అప్‌ళాసామీ" అని గట్టిగా ఎందుకో పిల్చే సమయంలో,

బైట ఘర్‌ఘర్ మని పెద్ద చప్పుడయింది. ఏఁవిఁటా అని అందరూ అటు చూసేరు. పోలీసు లారీ ఒకటి జరజరమని జబర్దస్తీగా వచ్చి పోర్టికోలో ఆగింది. అరక్షణంలో లారీ వెనక, జనం తండోప తండాలుగా వచ్చిపడ్డారు. పోలీసులు ఆస్పత్రిలోకి గభాల్న వచ్చిపడ్డారు.

జేబుకాల్ల పెదపాపడు దొరికిపోయేడు! ఊరవతల కొండ లోయలో గుండు దెబ్బ తిన్నాక చిక్కడ్డాడు. ఉరికంబాన్ని దగాచేసి పరలోకానికి పారిపోయే పరిస్థితిలో ఉన్నాడు.

"అయితే, స్ట్రెచర్ మీద తీసుకురండి!"

జేబుకాల్ల పెదపాపణ్ణి లోనికి స్ట్రెచర్ మీద తీసుకువచ్చేరు.

పని రాగానే స్ప్రింగులా లేచిన డాక్టర్ సుందరం అన్ని పనులూ మెథాడికల్‌గా చేస్తున్నాడు. హంతకుడి ప్రాణాన్ని "ఎలాగైనాసరే సేవ్ చెయ్యాలి సార్!" అని డాక్టర్‌గార్ని ప్రార్థిస్తున్నాడు పోలీస్ ఇనస్పెక్టరు. అందు గురించి మీరు నన్ను బతిమాలక్కర్లేదన్నాడు డాక్టర్ సుందరం.

కాని పేషెంట్ పరిస్థితి చాలా ప్రమాదంగానే ఉంది. తుపాకిగుండు వంట్లో వుండిపోయింది. రక్తం బాగా కారిపోయింది.

హవుస్సర్జను డాక్టర్‌గారికి అసిస్ట్‌చేస్తూనే ఇన్‌స్పెక్టరుతో మాట్లాడుతూ

గంభీరధ్వనులు చేస్తున్నాడు. చలాకీగా పారిపోయిన హంతకుణ్ణి చలాకీగా పట్టితెచ్చిన ఇన్‌స్పెక్టర్తో నర్సు "మీ ధైర్యానికి మిమ్మల్ని మెచ్చుకోవాలండీ! బలే గట్టి మనుషులు మీరు!" అని ముద్దుగా తెలుగుయాసతో చెప్తోంది. ఆ సమయంలో ఆమె నిల్చున్న స్థలంలోనే పోలీసు వారంతా వరసగా ఆవిణ్ణి ముద్దులాడినా ఆవిడ కమ్మగా కళ్లు మూసుకోవడమేగాని వద్దు వద్దనే మూడ్‌లో లేదు. అటు "అప్లాసామి" వీధిలో జనాన్ని లోనికి రానివ్వకుండా ఇనప కటకటాలు బిగించి, హడావిడిగా తిరుగుతూ ప్రముఖ పాత్ర వహిస్తున్నాడు.

"డాక్టర్ వాణ్ణి మీ రెలాగైనా సేవ్ చెయ్యాలి!"

ఈ రాక్షసుణ్ణి ఎందుకూ సేవ్ చెయ్యడం? అని ఆలోచించడంలేదు డాక్టర్ సుందరం. వాడు రాక్షసుడో, దివ్యుడో, అమాయకుడో, హంతకుడో' తర్కించడం లేదతను.

"పేషెంట్ దగ్గరికి ఎవరూ రావొద్దు. దూరంగా వుండండి అదీ, దట్స్‌రైట్!" ముందు తుపాకిగుండు తీసి పారేయాలి. ఈ ప్రాణాన్ని నిలిపితీరాలి. ముందు ఇతగాడికి రక్తం ఇవ్వాలి.

"ఎవరిస్తారు రక్తం?"

అర్జంటర్జంట్!

ఒక ఆసామి ముందుకొచ్చాడు.

రక్తం గ్రూప్ చెయ్యండి!

క్విక్!

అయిదా? పనికొస్తుందా? దట్స్‌రైట్! దట్స్‌గుడ్!

అన్నట్టు, ఈ రాక్షసుణ్ణి రక్షించడానికి రక్తం ఇచ్చిన ఇతగాడు రక్షకభటుడు!! అరె!!

ఎస్సర్! ఇతగాడే గురిచూసి తుపాకీపేల్చి దెబ్బతీసి ముద్దాయిని పట్టడానికి తోడ్పడ్డది!!

"అది మరీ బావుంది." అన్నాడు డాక్టర్ సుందరం.

"గమ్మత్తుగా ఉందే" అన్నాడు హవుస్సర్జను.

"శాళీ! శాళీ!" అని మెచ్చుకున్న నర్సు ఆ రక్షక భటుడే ఇన్‌స్పెక్టరయిపోతే ఎంత బావుణ్ణో అనుకుంది.

కాజ్యువల్టీరూం బైట పోలీసు అందర్నీ ఉండమన్చెప్పేడు డాక్టర్ సుందరం. అందరూ బైటకి వెళ్ళేరు. కొంతసేపయాక అతను బైటకి రాగానే పోలీస్ ఆఫీసర్లు అతన్ని

అడిగేరు!

"బ్రతుకుతాడంటారా?"

"బ్రతుకుతాడు"

అన్నాడు డాక్టర్ సుందరం.

"థాంక్స్" అన్నాడు ఇన్స్పెక్టర్.

"డ్యూటీ డ్యూటీ!" అన్నాడు డాక్టర్ సుందరం.

## సెంట్రల్ జెయిల్లో

చీకటిగా ఉంది.

తెల్ల వారుఝామున అయిదయింది. అంతటా అదేదో ముక్క-వాసన వేస్తోంది. చాలా గ్లూమిగా ఉంది.

విధిగా ఉండవలసిన ఆఫీసర్లు-అంటే జెయిలు సూపరెంటూ, జిల్లా మెడికలాఫీసరూ, జెయిల్ డాక్టరూ, మేజిస్ట్రేటూ, జెయిలరూ మొదలైనవారంతా-జెయిల్లో ఆ సమయంలో ఒకచోట సమావేశం అయేరు. అంతా పళ్ళూ, మూతులూ బిగించి నిల్చున్నారు.

అంతలో ఎక్కడో తోడేలు అరచినట్టయింది. దడదడ మని అడుగుల చప్పుడయింది. ఏడుస్తూన్న పెదపాపణ్ని జెయిలువార్డన్లు ఈడ్చుకొచ్చి నిలపెట్టేరు.

పనంతా పద్ధతి ప్రకారం జరుగుతోంది. ఎక్కడా ఏ తప్పూ జరక్కపోయినా ఎక్కడ ఏతప్పు జరుగుతుందోనని జెయిల్ సూపరెంటు భయంగా చిరాగ్గా ఉన్నాడు. పనెంత వేగిరం తెమిలిపోతే అంతమంచిదన్నట్టుగా అందరూ ముళ్ళ మీద నిల్చున్నట్టుగా నిల్చున్నారు.

పని జరుగుతూనే ఉంది.

పెదపాపడికి చేతులు విరిచి కట్టేరు. అతని కళ్ళకి గంతలు కట్టేరు. అతణ్ణి నూతిమీధ జల్లెడమీద నిలబెట్టి కాళ్ళకి తాళ్ళువేసి కట్టేరు.

మెడకి తాడు తగిల్చి బిగించేరు.

జెయిలరు జల్లెడ జార్చేడు.

గభాల్ని జేబుల్లోకి జారిపోయినట్టుగా నూతిలోకి దిగిపోయేడు జేబుకాట్ల పెదపాపడు.

నూతిలోకి దిగిన తాడు గింజుకొని గింజుకొని ఆఖరికి ఆగింది.

తరువాత కొంతసేపయేక,

రెండు చేతులూ గుండెలమీద బిగించుకొని నిల్చున్న జెయిల్ డాక్టర్ని ఉద్దేశించి జిల్లా మెడికల్ ఆఫీసర్‌గారు-

"కమ్‌ఆన్ డాక్టర్! మీ పేషెంట్‌ని తణికీ చేద్దాం రండి" అన్నారు.

పెద్దాస్పత్రిలో తను ఉన్నప్పుడు ఆరోజు రాత్రి చావుబ్రతుకుల మధ్యనున్న పెదపాపడి గురించీ, రక్తం ఇచ్చిన రక్షక భటుడి గురించీ, తన ఆరోజు డ్యూటీ గురించీ ఆలోచిస్తున్న డాక్టర్ సుందరం జిల్లామెడికలాఫీసర్ పిలవగానే చప్పున చేతులు విప్పి ముందుకి నడిచేడు. అతను "డ్యూటీ! డ్యూటీ!" అని నెమ్మదిగా గొణుక్కోడం ఎవరికీ వినిపించలేదు.

భారతి-(1954 లేదా 55)